క్లుప్తంగా

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం జయప్రద, పీడీలు, ఉపాధ్యాయులు

రాయదుర్గంటౌన్: ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులను శనివారం ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం జయప్రద మాట్లాడుతూ సోమవారం నుంచి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఇటీవల నియోజకవర్గస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారన్నారు. త్రోబాల్‌లో పౌర్ణమి, కల్పన, నందిని, బాల్‌బాడ్మింటన్‌లో మేఘన, సాయి మేఘన, పల్లవి, షైనాజ్, టెన్నికాయిట్‌లో కీర్తన, వాలీబాల్‌లో కీర్తన, తనుశ్రీ, బాడ్మింటన్‌లో మహిత, నిత్యశ్రీ, సాయి దీపిక, అథ్లెటిక్స్‌లో లావణ్య, దుర్గం, లాంగ్‌జంప్‌లో సంధ్య, యోగాలో రమ్యశ్రీ, తనూజ, దర్శిని, నవ్యశ్రీ జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో పీడీలు మల్లమ్మ, భాగ్య, యోగశ్వేత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందూ మహాగణపతికి పూజలు



అలంకరణలో హిందూ మహాగణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో మొట్టమొదటిసారిగా కొలువుదీరిన హిందూ మహాగణపతి వినాయక ఉత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. 6వ రోజు శనివారం మహాగణపతి దర్శనానికి భక్తులు క్యూకట్టారు. క్యారెట్, ముల్లంగి, కాకరకాయ, దోసకాయలతో మహాగణపతికి ప్రత్యేక అలంకరణ చేశారు. రాత్రి విధూషి జ్యోతి కళారాధన భరతనాట్యం డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో సంపూర్ణ రామయణ నృత్య రూపకం భక్తులను ఆకట్టుకుంది. మహాగణపతి ఉత్సవ లాటరీలో భాగంగా మొదటి బహుమతి రెనాల్ట్ క్విడ్ కారు, ద్వితీయ బహుమతిగా ఎలక్ట్రిక్ స్కూటర్‌ను సభావేదిక వద్ద ప్రదర్శించారు. ఉత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు రాజేష్, ప్రతాప్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

నేడు ఇంటి పట్టాల పంపిణీ

బొమ్మనహాళ్: మండలంలోని ఏలంజి గ్రామ పంచాయతీ పరిధిలో నూతన ఇంటి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్.రామాంజనేయులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అన్నారు. స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పబ్లిక్ హెల్త్ వర్కర్లకు వైద్య శిబిరంతో పాటు తడి చెత్త–పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని పాత మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్‌తో పాటు మెడికల్ ఆఫీసర్ సందేశ్‌కుమార్, వైస్ చైర్మన్ వలిబాషా, కౌన్సిలర్లు హాజరయ్యారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ హెల్త్ క్యాంపును కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, కౌన్సిలర్లు శారదాదేవి, శ్రీలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, వార్డు ఇన్‌చార్జులు పొరాళ్ల శివకుమార్, గోల్డ్ ఇస్మాయిల్, బషీర్ అహ్మద్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

అంజన్నకు అభిషేకం



బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి, సంతోష్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం





కళ్యాణదుర్గం: కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, బ్రహ్మసముద్రం: అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న మంత్రి

- సంక్షేమ పథకాలు చూసి పార్టీలోకి చేరికలు
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని, ఎన్ని పార్టీలు వచ్చినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే గెలుపని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ స్పష్టం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం కంబదూరు మేజర పంచాయితీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ, కాంగ్రెస్, జనసేన పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ పని అయిపోయిందన్నారు. టీడీపీ, జనసేన మధ్య ఉన్న ముసుగు తొలగిపోవడంతో.. ఆ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎన్ని పార్టీలు ఏకమై వచ్చినా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి జరిగే నష్టం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మేరకు వై నాట్ 175 అనే నినాదాన్ని నిజం చేస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో సీఎం జగనన్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి స్వచ్ఛందంగా వస్తున్నారన్నారు. అనంతరం కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కంబదూరు మేజర్ పంచాయతీలోని ఒంటారెడ్డిపల్లి, కోటగుడ్డం, జల్లిపల్లి, కొత్తపల్లి, ఎస్సీ కాలనీ, వడ్డే కాలనీ, 3,4,5,6,7,8 వ వార్డుల నుంచి సుమారు 200 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, జిల్లా కమిటీ సభ్యుడు నీలిశంకరప్ప, సచివాలయ కన్వీనర్ సాకే గంగాధర్, వైస్ ఎంపీపీ భీమేష్, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

బ్రహ్మసముద్రం: అంగన్ వాడీల్లో చిన్నారులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ సూచించారు. శనివారం మండలంలోని తీటకల్లు అంగన్ వాడీ కేంద్రాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేంద్రంలో పలు రికార్డులను మంత్రి పరిశీలించారు. చిన్నారుల హాజరు రికార్డులు తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను సిబ్బందితో ఆరాతీశారు . లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేయకపోవడంపై అంగన్‌వాడీ సిబ్బందిపై మంత్రి మండిపడ్డారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. అంగన్ వాడీలు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చిన్నారులతో మంత్రి ముచ్చటించారు.

నీతికి, అవినీతికి మధ్య పోరాటం

- మంచిచేసే ప్రభుత్వానికే ప్రజలంతా మద్దతుగా నిలవాలి
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: వచ్చే ఎన్నికల్లో నీతికి, అవినీతికి మధ్య పోటీ ఉంటుందని, ఎవరి హయాంలో ఎంత మేలు చేకూరిందో ప్రజలే ఓ సారి ఆత్మపరిశీలన చేసుకుని మద్దతుగా నిలవాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం డి హీరేహాళ్ మండల కేంద్రంలో పర్యటించిన విప్ కురుబ కాలనీలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం, ఎస్సీ కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో పూర్తయిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూరోడ్డు ముఖమే ఎరుగని గ్రామాలకు సైతం రూ.కోట్లు ఖర్చుచేసి తారురోడ్లు నిర్మించామన్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా సందు కనిపిస్తే చాలు సీసీ రోడ్లు వేయించిన ఘనత తమకే దక్కిందన్నారు. కాలవ శ్రీనివాసులు మంత్రిగా ఉండి చేతకాక వదిలేసిన పనులన్నీ తమ భుజాలపై వేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ సహకారంతో పూర్తి చేస్తూ వచ్చామన్నారు. రూ.41 కోట్లతో 39 గ్రామాలకు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పనులు వేగవంతంగా పూర్తి చేయిస్తున్నామన్నారు. నాడు–నేడు తో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలన్నీ కొత్త రూపు దిద్దుకుంటున్నాయన్నారు. ప్రతి గ్రామంలోనూ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ కేంద్రాలు ఇలా స్థిరాస్తులు నిర్మించి రూ.కోట్లు విలువ చేసే కార్యాలయాలను ప్రజలకే సొంతం చేస్తున్నామన్నారు. ఊరురూ అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. దేశానికే ఆదర్శంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నట్టు గుర్తుచేశారు. టీడీపీ అంటే తెలుగు దొంగల పార్టీ అని ఎద్దేవా చేశారు. వారి హయాంలో పచ్చనాయకులు, జన్మభూమి కమిటీలు తప్పా ప్రజలకు ఏకోశాన న్యాయం చేకూరలేదన్నారు. ఆఖరకు రాష్ట్రానికి గృహ నిర్మాణ శాఖ మంత్రిగా కాలవ ఉన్నా రాయదుర్గంలో పేదలకు ఇళ్లు కట్టించలేకపోయాడన్నారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయి జైలుకెళ్లాడని, నారా లోకేష్ కూడా అరెస్టు భయంతో ఢిల్లీకే పరిమితమవడంతో క్యాడర్ మొత్తం నిస్తేజంలోకి వెళ్లిందన్నారు. బాబు ఆర్థిక నేరగాడైతే కాలవ కరుడుగట్టిన దోపిడీ దారుడని మండిపడ్డారు. పేదలు మూడు పూటలా అన్నం తినాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. జగనన్న పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈ రామమోహన్‌రెడ్డి, జేఈ లక్ష్మీనారాయణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ తొండా వెంకటేశులు, పార్టీ నాయకులు సింగాడి జగదీష్, మంజునాథ, నాయకుడు రహంతుల్లా, ఎంపీడీఓ భాస్కర్ బాబు, తహసీల్దార్ ఈశ్వరరెడ్డి, డీటీ బసవకుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



లింగదహాళ్‌లో మహిళకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

బొమ్మనహాళ్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు శ్రీరామ రక్ష అని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, గీతాభార్గవి అన్నారు. మండలంలోని ఉద్దేహాళ్, లింగదహాళ్ గ్రామాల్లో శనివారం ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. వారు మాట్లాడుతూ 45 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో 105 రకాల మందులను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు,. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ యుగంధర్, ఎంపీహెచ్ఓ శివప్రసాద్, సీహెచ్ఓ అలివేలు, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, వెంకటరమణ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో పర్యటన

వజ్రకరూరు: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ ఏఈ చెన్నారెడ్డి పర్యటించారు. కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ లోక తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



పట్టణంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉరవకొండ: దోమలు వ్యాప్తిచెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ అమృతరాజ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ సూచించారు. దోమల వ్యాప్తి, డెంగీ వ్యాధిపై శనివారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ అధికారులు కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నిరసన

ఉరవకొండ: గుంతకల్లు పట్టణంలోని శ్రీవిద్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బండ విరిగిపడి యూకేజీ విద్యార్థిని కీర్తన మృతి చెందడంపై శనివారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జీవీఎస్ఎస్, ఆర్ఎస్‌యూ, ఎఐఎస్ఎఫ్, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్లాక్‌టవర్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యార్థి సంఘాల నాయకులు మోకాళ్లపై నిరసన తెలిపారు. జీవీఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకేపురుషత్తం, ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు భీమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, బీఎస్పీ మండల అధ్యక్షుడు రాము, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు రషీద్, స్వర్ణసాగర్, గణేష్, ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డెబిట్ చేయించుకోండి

కూడేరు: స్త్రీనిధి రుణం పొందిన డ్వాక్రా సంఘాల సభ్యులు వారి సంఘం ఖాతాకు ఆటో డెబిట్ చేయించుకోవాలని వైకేపీ ఏపీఎం రాజశేఖర్ సూచించారు. శనివారం ఆయన స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆటో డెబిట్ విధానంతో రుణాల చెల్లింపులో అక్రమాలకు తావుండదన్నారు. మీ సంఘం ఖాతాలో నిల్వ నగదుంటే ప్రతి నెలా ఆటోమెటిక్‌గా కట్ అవుతూ స్త్రీనిధి సంస్థకు జమవుతుందన్నారు. రికవరీలో జాప్యం జరగదన్నారు. తీసుకున్న రుణం సకాలంలో చెల్లిస్తే మళ్లీ కొత్తగా ఎక్కువ మొత్తంలో రుణాలు పొందడానికి అవకాశముంటుందన్నారు. స్త్రీనిధి రుణాల చెల్లింపుకు సంబంధించిన నగదును సిబ్బందికి ఇస్తే.. వారు చెల్లించకపోతే మీరు నష్టపోయే అవకాశముందన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

శెట్టూరు: బాల్య వివాహాల వల్ల అనర్థాలు చోటుచేసుకుంటాయని ఎంఈఓ శ్రీధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల కళాశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాల వల్ల నష్టాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. తెలియని వయస్సులో పెళ్లిచేయడం వల్ల జీవితం చిన్నాభిన్నం అవుతుందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాల చేసే తల్లిదండ్రులకు జైలు శిక్షపడుతుందన్నారు. అనంతరం పాఠశాలలోని బాలికలు బాల్య వివాహాలపై నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడి

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామానికి చెందిన సాయిదీక్షిత్ అనే విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడికి పాల్పడ్డారు. తండ్రి దాసరి రామాంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. సాయి దీక్షిత్ ఉరవకొండ పట్టణంలోని ది ఎడిషన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. శనివారం సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత స్కూల్ బస్సులో ఉరవకొండ నుంచి చాబాల వస్తుండగా సీట్ విషయమై సాయిదీక్షిత్‌పై తోటి విద్యార్థులు దాడిచేసి గాయపరిచారు. దాడి ఘటనను ప్రిన్సిపాల్ స్వరూపారాణి దృష్టికి తీసుకువెళ్లినట్లు విద్యార్థి తండ్రి తెలిపారు.

పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రకరూరు: పశువుల సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్య ఉపసంచాలకుడు (డిప్యూటీ డైరెక్టర్) వెంకటేశులు సూచించారు. శనివారం మండలంలోని గంజికుంట రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. అనంతరం పశువులు, గొర్రెలు, మేకలకు అందించిన వ్యాక్సిన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. అనిమల్ హజ్బెండరీ అసిస్టెంట్ రంగనాథ్ , సిబ్బంది పాల్గొన్నారు.

దుద్దేకుంటలో ఉచిత పశు వైద్యశిబిరం

బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంటలో కళ్యాణదుర్గం పశువైద్యశాల సహాయ సంచాలకుడు శ్రీనివాసగుప్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్య శిబిరంలో 28 దీర్ఘకాలిక వ్యాధిగ్రస్త పశువులు, 18 గొడ్డుమోతు పశువులు, 27 దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పశు వైద్యాధికారులు నాగబాబు, సహాయకులు వంశీ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు స్వామికి విశేష పూజలు, అర్చనలు చేపట్టారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహుడిని పల్లకిలో ఉంచి ఊరేగించారు. ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకానాథ్‌చార్యులు, బాలాజీ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

25న హుండీ కానుకల లెక్కింపు

పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని హుండీ కానుకు లెక్కింపు ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు ఈఓ విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ఆలయ అధికారుల సమక్షంలో హుండీలు తెరిచి లెక్కింపు చేపడతామన్నారు.

విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలి







రాయదుర్గం: మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, ఉరవకొండ: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మమత

రాయదుర్గం రూరల్: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సామాజిక సేవాగుణం అలవరచుకోవాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని 74 ఉడేగోళం వద్ద ఉన్న కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 24వ తేదీన జాతీయ సేవాపథక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రిన్సిపాల్ రఘురామమూర్తి అధ్యక్షతన జరిగిన మెగా రక్తదాన శిబిరానికి విప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛందంగా తరలి వచ్చి రక్తదానం చేసి, ప్రాణ దాతలు కావాలని సూచించారు. అనంతరం రక్తదానం చేసిన 60 మంది విద్యార్థులు, అధ్యాపకులను విప్ అభినందించారు. కార్యక్రమంలో రాయదురం మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్ ఫక్రుద్దీన్ , ఉలుగప్ప, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నారాయణ, రామకృష్ణ, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ కిరణ్, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ కోదండరాములు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం:విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి సూచించారు. స్థానిక కళాశాలలో శనివారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ శేషయ్య, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సూర్యనాగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎంటీ జోత్స్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉరవకొండ: విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో చేరితే సేవా దృక్పథం అలవడుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మమత అన్నారు. శనివారం స్థానిక ఇంటర్ బాలికల కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ డేను పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పొగ్రాం ఆఫీసర్లు ఖాదర్, శివప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానం

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ సచివాలయంలో ఖాళీగా ఉన్న ఒక వలంటీర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పాస్ అయి 35 ఏళ్లు నిండిన వారు అర్హులన్నారు. ఈనెల 27లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని వేపరాల, కాశీపురం, ఆవులదట్ల, మల్లాపురం గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ కొండయ్య శుక్రవారం సూచించారు. ఈనెల 28లోగా అర్హులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 30, అక్టోబర్ 3న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని గలగల, రంగసముద్రం గ్రామాల్లో ఖాళీగా వున్న వలంటీర్ పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నరసింహమూర్తి శనివారం తెలిపారు. ఈ నెల 28లోగా మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బొప్పాయి పంట ధ్వంసం



ఎలుగు బంట్లు ధ్వంసం చేసిన బొప్పాయి పంట

కళ్యాణదుర్గం: మండలంలోని పాలవాయి గ్రామంలో రైతు దినేష్‌కు చెందిన బొప్పాయి పంటను ఎలుగుబంట్లు ధ్వంసం చేశాయి. శనివారం అర్ధరాత్రి ఎలుగుబంట్లు పొలంలో చొరబడి బొప్పాయి చెట్లను ధ్వంసం చేసి నేలమట్టం చేశాయని బాధిత రైతు వాపోయాడు. సమీపంలోని కొండల్లో ఎలుగుబంట్లు అధికంగా ఉండటంతో పంటలు సాగు చేయాలంటే భయంగా ఉందన్నాడు. ఎలుగుబంట్ల దాడిలో సుమారు రూ.10 వేల వరకూ నష్టం వాటిల్లిందన్నాడు.

వర్షం కోసం పూజలు, భజనలు



బెళుగుప్పలో సప్త భజనను ప్రారంభించిన భక్తులు

బెళుగుప్ప/వజ్రకరూరు: వర్షం కోసం గ్రామీణులు పూజలు, భజనలు చేస్తున్నారు. బెళుగుప్ప మండలంలోని ఎర్రగుడి గ్రామంతో పాటు బెళుగుప్పలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద బొడ్రాయికి శనివారం 101 కలశాలతో గంగపూజ నిర్వహించారు. అనంతరం రామేశ్వరస్వామి ఆలయంలో సప్తభజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అలాగే వజ్రకరూరు మండలంలోని ధర్మపురి సీతారామస్వామి దేవాలయంలో శనివారం వర్షం కోసం విరాట పర్వం చదివి వినిపించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. విరాటపర్వం వినడానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో శనివారం రైతుల కు ప్రత్యామ్నాయ పంట విత్తనాలను పంపిణీ చేశారు. మండలంలోని చాబాల గ్రా మంలోని రైతుభరోసా కేంద్రంలో 150 మంది రైతులకు ప్రత్యామ్నాయ పంట విత్తనాలను పంపిణీ చేసినట్లు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కళ్యాణి తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు 80 శాతం రాయితీతో ఉలవలు, పెసలు, అలసందులు అందజేస్తోందన్నారు. అవసరమైన విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ముమ్మరంగా రీ సర్వే

వజ్రకరూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం రీ సర్వే మండలంలోని పొట్టిపాడు, రాగులపాడు, చిన్నహోతురు, గంజికుంట, గూళ్యపాళ్యం తదితర గ్రామాల్లో చురుగ్గా సాగుతోంది. శని వారం మండలంలోని గూళ్యపాళ్యంలో జరుగుతున్న రీసర్వేను ఇన్‌చార్జ్ తహసీల్దార్ కేశవరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో భూ సమస్యలకు చెక్ పడుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓలు, సచివాలయ సర్వేయర్లు, రీ సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ఉచితంగా అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎంకే బాషా సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు వచ్చి ఆరోగ్య సర్వే చేపడతారన్నారు. వారికి ఉచితంగా వైద్య సేవలందిస్తారన్నారు. అక్టోబర్ 3న గొటుకూరులో, 5న ఇప్పేరు, 6న కమ్మూరు, 7న కొర్రకోడు, 10న కూడేరు, 12న మరుట్ల–2, 13న ఉదిరిపికొండ, 17న కరుట్లపల్లి, 19న చోళసముద్రం, 20న నారాయణపురంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

సచివాలయాల తనిఖీ

శెట్టూరు: మండలంలోని శెట్టూరు, యాటకల్లు గ్రామ సచివాలయాల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామారావు శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిస్టర్లు పరిశీలించారు. నూతన పెన్షన్ లిస్ట్ వివరాలు, ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిదారుల సర్వే వివరాలు తెలుసుకున్నారు. ఆధార్ ప్రత్యేక క్యాంప్ కార్యక్రమాన్ని పరిశీలించారు. సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సంక్షేమ పథకాలు వచ్చేలా చూడాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనుల ప్రారంభం

కూడేరు: మండలంలోని కమ్మూరులో శనివారం సర్పంచ్ చిన్న రంగారెడ్డి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిధుల కింద సుమారు రూ.2.50 లక్షలతో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కింద నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఇప్పటికే రూ.9 లక్షలతో చేపట్టిన కల్వర్టు పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు.